క్లుప్తంగా

తాగునీటి సమస్య లేకుండా చర్యలు


అధికారులతో మాట్లాడుతున్న ఎంపీపీ అరుణారెడ్డి

ఓజిలి: మండలంలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ గద్దం అరుణారెడ్డి అధికారులను ఆదేశించారు. ఆమె సోమవారం మండల అధికారులతో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ మండల సమావేశంలో ప్రజా ప్రతినిధులు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. గ్రామాల్లో తాగునీటి బోర్లు, మరమ్మతులకు గురైన పైపులైన్లను వెంటనే సరిచేయాలన్నారు. తాగునీటి ట్యాంకుల్లో 15 రోజులకోసారి క్లోరినేషన్ చేయించాలని చెప్పారు. గ్రామాల్లో విద్యుత్ దీపాలు వెలిగేలా చూడాలని తెలిపారు. మండలంలో హౌసింగ్ కాలనీలు, ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి లబ్ధిదారులకు బిల్లులు మంజూరు చేయాలన్నారు. ఎంపీడీవో విజయలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సురేష్, నాయకులు దామోదర్‌రాజు, పరంధామరాజు పాల్గొన్నారు.

ఎంపీడీవోకు సన్మానం


ఎంపీడీవోను సన్మానిస్తున్న సిబ్బంది, కార్యదర్శులు

సైదాపురం: గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆనంద్ నుంచి ఉత్తమ పురస్కారం అందుకున్న ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్‌ను సోమవారం మండల పరిషత్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు సన్మానించారు. ఎంపీడీవో మాట్లాడుతూ అందరి సహకారంతోనే తనకు అవార్డు లభించిందన్నారు. అందరూ కలిసికట్టుగా మండల అభివృద్ధికి కృషి చేద్దామని పిలుపునిచ్చారు.

వీధి దీపాల ఏర్పాటుకు కృషి


అర్జీ స్వీకరిస్తున్న కౌన్సిలర్ ఆరిశంకరయ్య

వెంకటగిరి రూరల్ : వార్డులో వీధి దీపాలు ఏర్పాటుకు కృషి చేస్తానని 14వ వార్డు కౌన్సిలర్ ఆరిశంకరయ్య తెలిపారు. ఆయన సోమవారం 14వ వార్డులోని సుదర్శనం నగర్ సచివాలయంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలోని పలు వార్డుల్లో వీధి దీపాలు లేవన్నారు. ప్రజలు తమను నిలదీస్తున్నారని పేర్కొన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా మున్సిపాలిటీలోని 25 వార్డుల్లో వీధి దీపాలు, విడి పరికరాలు కొనుగోలుకు రూ.25 లక్షలు కేటాయించారని తెలిపారు. తమ వార్డు లో ఒక్క దీపం కూడా వేయలేదని ఆరోపించారు. అధికారులను అడిగితే సమాధానం చెప్పడం లేదన్నారు. మూడు నెలల నుంచి ఫాగింగ్ చేపట్టాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. కుక్కల బెడద ఎక్కువగా ఉందని, సుమారు 50 మందికిపైగా కుక్కకాటుకు గురయ్యారని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

గూడూరు రూరల్ : విద్యార్థులు బాగా చదివి పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని స్టార్టప్ అండ్ ఇండస్ట్రీ రెడీ స్కిల్స్ కో-ఆర్డినేటర్ ఇమ్మానియేల్ ఆకాంక్షించారు. పట్టణంలోని ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం స్టార్టప్ అండ్ ఇండస్ట్రీ రెడీ స్కిల్స్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది నవీన్ కుమార్, ధనుంజయ, వేణుమాధవ్, రాజయ్య, ప్రణయ్‌కుమార్, ఏవో రామయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యాన్ బోల్తాపడి ముగ్గురికి గాయాలు

పెళ్లకూరు: నాయుడుపేట-పూతలపట్టు జాతీయ రహదారిలోని పెన్నేపల్లి క్రాస్ రోడ్డు వద్ద సోమవారం వ్యాన్ బోల్తాపడింది. ముగ్గురు గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. ఆరుగురు షార్ సిబ్బందిని తీసుకుని వ్యాను బెంగళూరు నుంచి శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌కు వెళుతోంది. పెన్నేపల్లి క్రాస్‌లో రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొని బోల్తా పడింది. షార్ సిబ్బంది నారాయణన్, మాధవన్, శ్రీధర్ గాయపడ్డారు. వారిని స్థానికులు నాయుడుపేటకు తరలించారు.

గుండెపోటుతో హెడ్ కానిస్టేబుల్ మృతి


వెంకటయ్య(ఫైల్)

వెంకటగిరి(సైదాపురం): వెంకటగిరిలో సోమవారం విధి నిర్వహణలో ఉన్న హెడ్‌కానిస్టేబుల్ గుండెపోటుతో మృతి చెందారు. ఎస్‌ఐ సుబ్బారావు కథనం మేరకు.. బాలాయపల్లి మండలం తాళ్లపల్లికి చెందిన నిడిగంటి వెంకటయ్య(57) వెంకటగిరి పోలీసు స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. సోమవారం ఉదయం యథావిధిగా విధులకు హాజరయ్యారు. మధ్యాహ్నం ఉన్నట్టుండి గుండెపోటు రావడంతో అస్వస్థకు గురయ్యారు. వెంటనే వెంకటగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తీసుకెళుతుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. వెంకటయ్య మృతి చెందడంపై సీఐ ఏవీ రమణ, ఎస్‌ఐలు సుబ్బారావు, భవాని సంతాపం వ్యక్తం చేశారు.

మీజూరులో మొండి గోడలకే పరిమితమైన ఆర్బీకే, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలు





మొండిగోడలకే పరిమితం

ప్రజలకు స్థానికంగానే ప్రభుత్వ సేవలను అందించేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చింది. అందులో భాగంగానే వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్, రైతుల కోసం వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటుచేసింది. వాటికి పక్కా భవనాలు నిర్మించింది. కొన్నిచోట్ల నిర్మాణాలు చేపట్టింది. 2024 ఎన్నికల్లో ప్రభుత్వం మారడం, కూటమి ప్రభుత్వం వాటి గురించి పట్టించుకోకపోవడంతో నిర్మాణాలు ఆగిపోయి మొండిగోడలకే పరిమతమయ్యాయి. అవి క్రమేపీ దెబ్బంతింటున్నాయి.

- పూర్తికాకుండానే దెబ్బతింటున్న గోడలు
- అసంపూర్తి భవనంలోనే సచివాలయం నిర్వహణ
- పట్టించుకోని పాలకులు, అధికారులు


మీజూరులో అసంపూర్తిగా ఉన్న భవనంలో నిర్వహిస్తున్న సచివాలయం

దొరవారిసత్రం : మండలంలోని మీజూరు గ్రామంలో మూడేళ్ల క్రితం సచివాలయం, ఆర్బీకే, విలేజ్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణాలు చేపట్టారు. ఒక్కో భవనానికి రూ.45 లక్షల మేర నిధులు మంజూరయ్యాయి. సచివాలయం భవనం కొంతమేర పూర్తయింది. మిగిలిన రెండు మొండి గోడలకే పరిమితమయ్యాయి. సచివాలయ సిబ్బంది అతి కష్టం మీద అసంపూర్తిగా ఉన్న భవనంలోనే ఒక గదిలో విధులు నిర్వహిస్తున్నారు. మీజూరు తీర ప్రాంతం కావడంతో సముద్రంపై నుంచి వీచే ఉప్పు గాలులకు గోడలు దెబ్బతింటున్నాయి. వాటిని అలాగే వదిలేస్తే ఎందుకూ పనికిరాకుండా పోతాయని స్థానికులు చెబుతున్నారు. అదే విధంగా వేణుంబాకం, తల్లంపాడు, ఉచ్చూరు గ్రామ సచివాలయాల పరిధిలోని సచివాలయం, ఆర్బీకే, హెల్త్ క్లినిక్ భవనాలు కూడా అసంపూర్తిగానే ఉన్నాయి. పూలతోట, తనియాలి గ్రామాల్లో సచివాలయం భవనాలు తప్ప మిగిలిన ఏ భవనమూ పనులు మొదలేకాలేదు. ఏకొల్లులో అన్ని భవన నిర్మాణాలు పునాదులు దాటక పోవడం గమనార్హం.

ఆశీర్వాదం


సైపుద్దీన్‌ను ఆశీర్వదిస్తున్న నేదురుమల్లి

వెంకటగిరి(సైదాపురం) : వెంకటగిరి పట్టణం 20వ వార్డుకు చెందిన ఏఎంసీ మాజీ చైర్మన్ సయ్యద్ అబూబకర్ కుమారుడు, వైఎస్సార్ సీపీ వెంకటగిరి టౌన్ సోషల్ మీడియా కార్యకర్త సయ్యద్ సైపుద్దీన్, సయ్యద్ సబీన్ వివాహం సోమవారం శ్రీకాళహస్తిలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఇందులో వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు.

గోకులాల బిల్లులు మంజూరు చేయాలని వినతి

ఓజిలి: మండలంలోని కురుగొండ గ్రామంలో నిర్మించుకున్న గోకులాల షెడ్లకు బిల్లులు మంజూరు చేయాలని పాడిరైతులు కోరారు. వారు సోమవారం ఎంపీడీవో విజయలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ తమ గ్రామంలో 20 గోకులాలు నిర్మించుకున్నామని తెలిపారు. కొంతమందికి బిల్లులు వచ్చాయన్నారు. మిగిలిన వాటికీ బిల్లులు చెల్లించాలని కోరారు. స్పందించిన ఎంపీడీవో అక్కడేవున్న ఏపీవో ఉషారాణితో చర్చించారు. లబ్ధిదారులు ఆధార్ కార్డులు పరిశీలిస్తే సగం బిల్లులు చెల్లించినట్టు తెలిపారు. గోకులాలను పరిశీలించి మిగిలిన బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

గ్రామ సమీపంలో బస్ షెల్టర్ నిర్మించాలని వినతి


గ్రీవెన్స్‌లో వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు

పెళ్లకూరు: 71వ నంబరు జాతీయ రహదారిలోని తాళ్వాయిపాడు-పెన్నేపల్లి మధ్య ప్రయాణికులకు అనుకూలంగా బస్ షెల్టర్ నిర్మించాలని స్థానికులు కోరారు. వారు సోమవారం తిరుపతి జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్‌లో అధికారులకు వినతి పత్రం అందజేశారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా బస్ షెల్టర్‌ను గ్రామానికి రెండు కిలోమీటర్లు దూరంలో నిర్మించేందుకు కాంట్రాక్టు సంస్థ ప్రయత్నిస్తోందని తెలిపారు. రెండు గ్రామాల ప్రజలు ఇబ్బంది పడాల్సి వస్తుందని పేర్కొన్నారు. గ్రామాల సమీపంలో బస్ షెల్టర్ నిర్మించాలని కోరినా పట్టించుకోవడం లేదని వాపోయారు. కార్యక్రమంలో గ్రామస్తులు వెంకటేశ్వర్లు, మధు, శ్రీనివాసులు, భాస్కర్, పెంచలయ్య, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పైపులు ఏర్పాటుచేయాలని గ్రామస్తుల నిరసన


నిరసన తెలుపుతున్న దళితవాడ ప్రజలు


మాట్లాడుతున్న ఎంపీడీవో వినీల్‌కుమార్

బాలాయపల్లి(సైదాపురం) : సీసీరోడ్డు నిర్మాణంలో భాగంగా వర్షపు నీరు, మురుగు నీరు వెళ్లేందుకు పైపులు ఏర్పాటుచేయాలని అక్కసముద్రం దళితవాడ వాసులు డిమాండ్‌చేశారు. వారు సోమవారం నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ గ్రామంలో రూ.5 లక్షలతో సీసీరోడ్డు నిర్మిస్తున్నారని తెలిపారు. వర్షపు నీరు, ఇళ్ల నుంచి వచ్చే మురుగు నీరు వెళ్లేందుకు ఏర్పాట్లు చే యకుండానే రోడ్డు వేస్తున్నారని తెలిపారు. గతంలో నీరు వెళ్లేందుకు రోడ్డుకు అడ్డంగా తూము ఏర్పాటు చేశారని తెలిపారు. ప్రస్తుతం రోడ్డు నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరించి తూము, పైపులు పెట్టకుండానే పనులు చేస్తున్నారని దుయ్యబట్టారు. దీంతో వర్షాలు కురిసిన సమయంలో నీరు ఇళ్లలోకి వస్తుందని తెలిపారు. సమాచారం అందుకున్న ఎంపీడీవో వినీల్‌కుమార్ అక్కడికి చేరుకున్నారు. మురుగు నీరు వెళ్లేందుక రోడ్డు అడ్డంగా పైపులు వేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మోహన్‌రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చేపల చెరువు వేలం వాయిదా


వేలం పాటను వాయిదా వేస్తున్నట్లు ప్రకటిస్తున్న అధికారులు

పెళ్లకూరు: మండలంలోని చిల్లకూరు పెద్ద చెరువులో ఈ ఏడాది చేపలు పట్టుకోవడానికి సోమవారం స్థానిక సచివాలయం వద్ద వేలం పాటలను రెండోసారి వాయిదా వేశారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వేలంపాట కోసం కనీసం ఒక్కరు కూడా డిపాజిట్ చెల్లించలేదు. ఈ క్రమంలో ఈవోపీఆర్‌డీ విజయలక్ష్మీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వేలంపాటలను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి ఎలాంటి వివాదాలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సూర్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

31 నుంచి గురుదత్త హోమ పూజలు

నాయుడుపేట టౌన్ : మండలంలోని తిమ్మాజికండ్రిగ సమీపంలో స్వర్ణముఖి నది ఒడ్డున ఉన్న దత్తాత్రేయ మందిరంలో ఈ నెల 31 నుంచి మూడు రోజులు గురుదత్త హోమ పూజలు నిర్వహించనున్నట్టు కుందర్తి బాల సురేష్ శర్మ తెలిపారు. ఆయన సోమవారం దత్త హోమ పూజల కరపత్రాలు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మైసూరుకు చెందిన పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామీ భక్త బృందంతో పాటు ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి సుమారు 60 మందికి వైగా వేద పండితులు హోమాలు, పూజలుచేస్తారని తెలిపారు. కార్యక్రమంలో గురుదత్త మందిర వ్యవస్థాపకులు కామిరెడ్డి ప్రతాప్ రెడ్డి, చక్కిరాల సాయికుమార్ శర్మ, అశ్వినీదీక్షిత్ శర్మ, మోహిశ రావత్ శర్మ, మల్లెల జ్యోతి రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు

కలువాయి: రిపబ్లిక్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏడీపీఎస్ కలువాయి శాఖ సోమవారం శివసాయి కళాశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించింది. అనంతరం విజేతలకు బహుమతులు అందజేసింది. నాయకులు నిజమాల ప్రసాద్, రేవూరి శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ నరేంద్రకుమార్, పి.శ్రీనివాసులు సీఆర్ఎంటీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపు మూసివేత

సైదాపురం: కలిచేడులో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న మద్యం షాపును సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది మూసివేయించారు. కలిచేడులో ప్రభుత్వ స్థలంలో కంటెనర్‌ను షాపుగా మార్చి మద్యం దుకాణం నిర్వహిస్తున్నారు. అది కాలనీ సమీపంలో ఉండడంతో దాన్ని తొలగించాలని స్థానికులు జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తిచేశారు. ఈ క్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు డిసెంబర్ 31న తహసీల్దార్ రమాదేవి తమ సిబ్బందితో కలిసి షాపును మూసివేయించారు. దుకాణాన్ని మరోచోట ఏర్పాటుచేసుకోవాలని యాజమాన్యానికి సూచించారు. అతను పట్టించుకోకుండా దుకాణాన్ని నిర్వహిస్తుండడంతో గ్రామస్తులు మరోసారి అధికారులకు ఫిర్యాదు చేశారు. వారి ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు దుకాణాన్ని మూసివేయించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

వెంకటగిరి రూరల్ : గ్యాస్ సిలిండర్ పేలి తీవ్రంగా గాయపడిన కొంపల అనసూయమ్మ(62) సోమవారం మృతిచెందింది. వెంకటగిరి పట్టణం బంగారుపేటలో గత శుక్రవారం తెల్లవారుజామున గ్యాస్ సిలిండర్ పేలడంతో ఇద్దరి తీవ్ర గాయాలు, మరొకరికి స్వల్ప గాయాలు అయ్యాయి. ఈ క్రమంలో అనసూయమ్మ తిరుపతి రుయాలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం మృతిచెందింది. దీంతో బంగారుపేటలో విషాదఛాయలు అలుముకున్నాయి.

వాకాడు ట్రాన్స్‌కో ఏఈగా విజయలక్ష్మి



వాకాడు : మండల కేంద్రమైన వాకాడు ట్రాన్స్‌కో ఏఈగా విజయలక్ష్మి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె వాకాడులో సబ్ ఇంజినీర్‌గా పనిచేస్తూ ఏఈగా ఉద్యోగోన్నతి పొందారు. ఈ సందర్భంగా మండలంలోని విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది ఆమెను అభినందించారు. కార్యక్రమంలో ఎల్ఐ రవి, లైన్‌మెన్లు సోంబాబు, మురళీ, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నేషనల్ ఎలక్ట్రీషియన్ డే


ర్యాలీ చేస్తున్న ఎలక్ట్రీషియన్లు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేటలో సోమవారం నేషనల్ ఎలక్ట్రీషియన్ డేను ఘనంగా జరుపుకున్నారు. నాయుడుపేట స్వర్ణముఖి ఎలక్ట్రీషియన్ ప్లంబర్ అసోసియేషన్ నాయకులు, చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన ఎలక్ట్రీషియన్లు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ అందరు కలిసికట్టుగా ఉండి సమస్యలను పరిష్కరించుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం శివాలయం వద్ద అన్నదానం చేశారు. కార్యక్రమంలో కోటకొండ కృష్ణయ్య, చెందేటి వెంకటేశ్వర్లు, కమలాకర్, వేణు, కిరణ్ పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

గూడూరు రూరల్ : విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలని గూడూరు డీఎస్పీ గీతా కుమారి తెలిపారు. ఆమె సోమవారం గూడూరు పట్టణంలోని దువ్వూరు రమణమ్మ మహిళా డిగ్రీ కళాశాలలో 44వ వార్షిక స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తుంచుకోవాలన్నారు. క్రీడల్లో వివిధ విభాగాల్లో ప్రతిభ చూపిన వారిని అభినందించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కె మెహర్మని, విద్యాసాగర్‌రావు, అధ్యక్షుడు ఎం శివకుమార్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ జనార్ధన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ హనుమంతరావు పాల్గొన్నారు.

అధిక ఎరువుల వినియోగం అనర్థదాయకం

సైదాపురం: పంటల సాగులో రసాయనిక ఎరువులను ఎక్కువగా వినియోగిస్తే అనర్థాలు కలుగుతాయని ఏవో హైమావతి తెలిపారు. మండలంలోని కమ్మవారిపల్లిలో సోమవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అనంతరం క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ వరిసాగులో తగిన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. తెగుళ్ల వచ్చిన వెంటనే అధికారులను సంప్రదించాలని సూచించారు.

రీ సర్వేతో రైతుల భూసమస్యలకు చెక్

గూడూరు రూరల్ : రీ సర్వేలో భాగంగా చేపట్టిన ఉమ్మడి సర్వేతో భూ సమస్యలకు చెక్ పెట్టవచ్చని, రైతులకు భూమిపై సర్వ హక్కులు వస్తాయని తహసీల్దార్ చంద్రశేఖర్ తెలిపారు. గూడూరు రూరల్, బాలాయపల్లి మండలాల సరిహద్దులో సోమవారం వెంకటగిరి అటవీశాఖ అధికారులు, మండల సర్వేయర్లు రీసర్వేను పరిశీలంచారు. తహసీల్దార్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతి రైతూ తమ భూముల వద్ద ఉండి ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు.

పశుపోషణలో జాగ్రత్తలు అవసరం


సిద్ధవరంలో పశువులకు చికిత్స చేస్తున్న ఏడీ అనీల్‌కుమార్

చిట్టమూరు : గ్రామీణ ప్రాంతాల్లోని పాడి రైతులు పశువుల పోషణలో జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్యాధికారి సురేంద్ర తెలిపారు. మండలంలోని ఈశ్వరవాక గ్రామంలో సోమవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. గేదె, ఆవు చూలుకు వచ్చినప్పటి నుంచి సూచించిన సమయంలో తప్పని సరిగా టీకాలు వేయించాలన్నారు. పోషక విలువలు కలిగిన దానా వేయాలన్నారు.

పశువులకు వైద్య చికిత్సలు

రాపూరు: మండలంలోని సిద్ధవరం, తూమాయి గ్రామాల్లో సోమవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. పశుసంవర్ధక శాఖ ఏడీ అనీల్‌కుమార్ పశువుల్లో గర్భకోశ వ్యాధులకు చికిత్స చేశారు. గొర్రెలు, మేకలకు వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణ మందులు వేశారు. కార్యక్రమంలో సంక్రాంతిపల్లి పశువైద్యులు సుప్రజ, పశుసంవర్ధకశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కలువాయిలో..

కలువాయి: మండలంలోని ఉయ్యాలపల్లిలో సోమవారం పశువైద్యాధికారి డాక్టర్ గంగాధర్ పశువైద్య శిబిరం నిర్వహించారు. 150 గేదెలు, 260 ఆవులు, 58 దూడలకు నట్టల నివారణ మందు తాగించారు. పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స చేశారు. కార్యక్రమంలో వీఏ ఓబయ్య, ఏహెచ్ఏ జైపాల్, నరేష్, శ్రీనివాసులు, శివయ్య పాల్గొన్నారు.

ఎవరి మెప్పుకోసమో హడావుడి గ్రామ సభలు

- 2 గంటల్లో ఐదు గ్రామాల్లో సభలు
- అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలతోనే సరిపెట్టిన వైనం


చెన్నూరు గ్రామ సభలో సబ్ కలెక్టర్ పక్కనే అధికార పార్టీ నేతలు (ఫైల్)

సాక్షి టాస్క్‌ఫోర్స్: గూడూరు మున్సిపాలిటీలో గ్రామాల విలీనంపై మూడు రోజుల క్రితం సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనన్ గూడూరు మున్సిపాలిటీ ప్రత్యేక అధికారి హోదాలో హడావుడిగా గ్రామసభలు నిర్వహించారు. రెండు గంటల్లోనే ఐదు గ్రామాల్లో తూతూమంత్రంగా సభలు నిర్వహించడం, అందులోనూ కూటమి నేతలు, కార్యకర్తలతో సరిపెట్టడంపై ఆరోపణలు వెల్లువెత్తాయి.

గూడూరు మున్సిపాలిటీని గ్రేడ్-1గా మార్చాలని గత ప్రభుత్వ హయాంలో నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా గూడూరు సమీపంలో ఉన్న ఐదు పంచాయతీలను మున్సిపాలిటీలో విలీనం చేశారు. దీనిపై అప్పటి అధికార పార్టీ నేతలే కోర్టును ఆశ్రయించారు. దీంతో అటు మున్సిపాలిటీలోనూ, ఇటు ఐదు పంచాయతీల్లోనూ ఎన్నికలు జరగలేదు. ఇప్పటికీ ఈ విషయం కోర్టులో నడుస్తోంది. ప్రత్యేక అధికారి పాలనలోనే మున్సిపాలిటీ కొనసాగుతోంది. ఈ క్రమంలో పంచాయతీలను మున్సిపాలిటీలో విలీనం చేయడం ప్రజలకు ఇష్టం లేనట్టు చెప్పించాలని, తదుపరి కోర్టు నుంచి లైన్ క్లియర్ చేసుకుని ఎన్నికలు నిర్వహించి తమ వారికి చైర్మన్ గిరి కట్టబెట్టాలని ప్రస్తుతం అధికారంలోవున్న ప్రజాప్రతినిధి భావించారు. ఇందులో భాగంగానే ఆయా పంచాయతీల్లో గ్రామసభలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇందుకు అవసరమైతే తమ పార్టీ కార్యకర్తలు, నాయకుల సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. దీంతో అధికారులు ఇటీవల గ్రామాల్లో దండోరా వేయకుండానే హడావుడిగా మధ్యాహ్నం 3 నుంచి 5.30 గంటల్లో ఐదు పంచాయతీల్లో గ్రామ సభలు పూర్తి చేశారు. సాధారణంగా ఐదు రోజుల ముందు గ్రామసభలపై ప్రజలకు మైక్‌ల ద్వారా తెలియజేయాలి. దండోరా వేయించాలి. తర్వాత వారి అభిప్రాయాలు సేకరించాలి. నిబంధనలు పాటించకుండా హడావుడిగా గ్రామసభలు నిర్వహించారు. గ్రామసభ వేదికలపైనా ఆయా గ్రామ పంచాయతీల్లో ఎలాంటి హోదా లేని అధికార పార్టీ నేతలే కూర్చున్నారు.

తమ పథకం పారదని..

ఈ ఐదు పంచాయతీల్లో ఒకటైన దివిపాళెంలో గ్రామ సభ నిర్వహించాల్సి ఉంది. ఇక్కడి ప్రజలు తమ పంచాయతీని మున్సిపాలిటీలో విలీనం చేయాలని ముందునుంచీ కోరుతున్నారు. ఈ క్రమంలో అక్కడ ఎక్కువ మంది పంచాయతీని మున్సిపాలిటీలో విలీనం చేయాలని వినతులు అందజేస్తారని, తద్వారా తమ పథకం పారదని అధికార పార్టీ నాయకులు గుర్తించారు. దీంతో ఆ గ్రామానికి మూడు కిలోమీటర్ల దూరంలోని నెలటూరులో రెండు పంచాయతీలకు చెందిన గ్రామ సభను నిర్వహించి చేతులు దులుపుకున్నారు. విలీన గ్రామ పంచాయతీల్లో చేపట్టిన గ్రామ సభలను పూర్తిగా రద్దు చేసి పార్టీలకు అతీతంగా మరోసారి గ్రామ సభలు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.

కండలేరులో 54.984 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 54.984 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరుకు సోమశిల జలాశయం నుంచి 180 క్యూసెక్కుల నీరు వస్తోందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 650, లోలెవల్ కాలువకు 70, హైలెవల్ కాలువకు 200, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.